

బైక్ స్కామ్ నిందితుల అరెస్టు

ఇన్సూరెన్స్ కంపెనీలను మోసగిస్తూ బైకులను విక్రయించిన తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో ▸



ఆలయాల్లో ఈవోల కొరత

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో కార్యనిర్వహణాధికారుల (ఈవో) కొరత తీవ్రంగా ఉంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 34.9 /16.9

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

రక్తదానం అభినందనీయం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

మోపాల్(నిజామాబాద్‌రూరల్): తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదానం చేయటం అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా నగర శివారులోని బోర్గాం(పి) చౌరస్తాలో శివాజీ మహరాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ రక్తదానం, అన్నదానంతో సమానమని పేర్కొన్నారు. తలసేమియాతో నెలల వయస్సుగల పిల్లలు సైతం బాధపడుతున్నారని, రక్తం యూనిట్ల కొరతతో అనేక మంది ఇబ్బందిపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రక్తదానం చేసిన వారితోపాటు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సేవాసమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, సంఘాల ప్రతినిధులు నల్ల దినేష్‌రెడ్డి, అంబదాస్ రావు, నరేందర్, విజయ్, ఆకాశ్, సురేశ్, కెంపుల నాగరాజు పాల్గొన్నారు.

శివాజీ జయంతికి పోలీసు బందోబస్తు

ఖలీల్‌వాడి: శివాజీ జయంతి ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా నగరంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఐదుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు, 20 మంది ఏఎస్సైలు, 30 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 150 మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులతో భద్రత కల్పించినట్లు పేర్కొన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు.

రేపు ప్లేస్‌మెంట్ డ్రైవ్

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్, కెరీర్, గైడెన్స్ విభాగాల ఆధ్వర్యంలో డ్రైవ్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సౌజన్యంతో ఉదయం 9.30 గంటలకు కళాశాల ఆడిటోరియంలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. బ్యాంకింగ్ ఉద్యోగాల కోసం చేపడుతున్న ఈ డ్రైవ్‌లో డిగ్రీ పూర్తి చేసిన, ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు అర్హులని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 9059344379 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రైతుల శ్రేయస్సు కోసమే డీపీసీ

- నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి



డీపీసీని ప్రారంభించిన చైర్మన్ గంగారెడ్డి

సుభాష్‌నగర్: పసుపు రైతుల శ్రేయస్సు కోసమే నిజామాబాద్ మార్కెట్ యార్డులో డైరెక్ట్ పర్చేస్ సెంటర్ (డీపీసీ) ఏర్పాటు చేశామని ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ అపర్ణతో కలిసి బుధవారం డీపీసీని ప్రారంభించారు. గంగారెడ్డి మాట్లాడుతూ పసుపు సీజన్‌లో రైతులకు మంచి ధర రావడం కోసమే డీపీసీని ప్రారంభించామన్నారు. డీపీసీలోకి రైతులు తీసుకొచ్చిన పసుపును వ్యాపారులు పరిశీలించి ధర కోట్ చేయాలన్నారు. రైతులు నాణ్యమైన పసుపును యార్డుకు తీసుకొస్తే ఎలాంటి కమీషన్ కోత లేకుండా ఖాతాలో డబ్బులు పడతాయని తెలిపారు.

టీచర్‌పై వీధి కుక్కదాడి



రుద్రూర్: మండల కేంద్రంలో ఓ ప్రైవేటు పాఠశాల టీచర్‌పై వీధి కుక్క దాడి చేసింది. వివరాలు ఇలా.. రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్తున్న ప్రైవేట్ టీచర్ లక్ష్మిని కుక్క కరిచింది. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నగరంలోని దుబ్బా చౌరస్తాలో శివాజీ విగ్రహం వద్ద నిర్వహించిన లేజర్ షోకు హాజరైన ప్రజలు



జయహో ఛత్రపతి శివాజీ

- ఘనంగా వీర శివాజీ జయంతి
- వైభవంగా శివాజీ ప్రతిమలతో శోభాయాత్ర

మొఘల్ సామ్రాజ్యపు పునాదుల్ని బద్దలు కొట్టి.. భరతజాతికి ఊపిరిలూది కొత్త జవసత్వాలు అందించిన మహా యోధా.. జయహో ఛత్రపతి శివాజీ అనే నినాదాలు మార్మోగాయి. జిల్లా వ్యాప్తంగా శివాజీ మహరాజ్ జయంతిని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఛత్రపతి మహరాజ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్సవ సమితి, యువజన సంఘాలు, వివిధ సంస్థలు శివాజీ ప్రతిమలతో ఇందూరు పురవీధులగుండా రథయాత్రలు, ర్యాలీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా యువకులు కాషాయ జెండాలను చేతపట్టుకొని జై భవానీ .. జై శివాజీ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.



కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లో శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

బీసీలపైన ప్రేమతోనే..

- కులగణనకు చట్టబద్ధత కల్పిస్తాం
- కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు
- కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోలేదు
- పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్



పట్టభద్రుల ఎమ్మెల్సీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, వేదికపై మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తదితరులు

నిజామాబాద్ సిటీ : బీసీల మీద ప్రేమతోనే కులగణన చేపట్టామని పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్‌ఎస్‌తో బీజేపీ లోపాయి కారి ఒప్పందం కుదుర్చుకుందని విమర్శించారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలున్నా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ఒక్కరూపాయి కూడా తీసుకురాలేదన్నారు. బీజేపీ మతం పేరుతో రాజకీయాలు చేస్తోందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 ఎమ్మెల్యే సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మ హేశ్ కుమార్ గౌడ్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లికృష్ణారావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్ కుమార్ మాట్లాడారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను వేలకోట్ల అప్పులుచేసి అప్పుల కుప్పగా మార్చారని, కేసీఆర్ కేవలం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని అన్నా రు. ప్రజలు బీఆర్‌ఎస్‌ను తిరస్కరించి కేవలం ప్రతిపక్షానికి పరిమితం చేస్తే కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్షహోదా ఎలా అనుభవిస్తారని ప్రశ్నించారు. కులగణనకు చట్టబద్ధత కల్పిస్తామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 56 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. నిరుద్యోగులను, బీసీలను కేసీఆర్ ఏనాడు పట్టించుకోలేదన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవని బీఆర్‌ఎస్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కనీసం అభ్యర్థిని నిలబెట్టలేక పోయిందన్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని బీఆర్‌ఎస్ వ్యాఖ్యానించడం ఏమాత్రం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ పని, కేసీఆర్ పని ఖతమైందన్నారు. వేల మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి దక్కుతుందన్నారు. విద్యావంతులను గెలిపిస్తేనే వారు నిరుద్యోగుల తరపున గొంతెత్తుతారని అన్నా రు. బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీసీ ల కులగణనను విజయవంతం చేసి తీరతామని మంత్రి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి తప్పదని, డిపాజిట్ రాదనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ పోటీచేయలేదని మంత్రి జూపల్లి విమర్శించారు. బీజేపీకి ఓటువేస్తే బీఆర్‌ఎస్‌కు వేసినట్లేనని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా.. రేవంత్ రెడ్డి ఎన్నిక ల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. ప్ర భుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించిందని, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నదని మంత్రి వెల్లడించారు. ఉద్యోగులకు, నిరుద్యోగులకు మేలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

సమావేశంలో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, తోట లక్ష్మీకాంతారావు, నాగరాజు, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, కార్పొరేషన్ల చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందన్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ఫలితాలు.. తెలంగాణలో పునరావృతం !

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్

సుభాష్‌నగర్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి బీజేపీ కార్యకర్త కర్తవ్యంగా భావించి పని చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ పిలుపు నిచ్చారు. బుధవారం రాత్రి నగర శివారులోని ఓ ప్రైవేట్ హోటల్ లో ఉమ్మడి నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా సునీల్ బన్సల్, పార్టీ తెలంగాణ సంఘటన మంత్రి చంద్రశేఖర్ జీ, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎన్నికల బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, బీజేపీ, తపస్ బలపరిచిన టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమరయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభావిత ఓటర్లను గుర్తించి వారితో వ్యక్తిగతంగా పరిచయం పెంచుకోవాలన్నారు. ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలుసుకుని అభ్యర్థి గురించి అవగాహన కల్పించాలన్నారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణలో పునరావృతం అవుతున్నాయని ఓటర్లకు తెలియజేయాలన్నారు. ఢిల్లీలో మొదలైన విజయం, గల్లీలో కాషాయ జెండా ఎగురవేసే వరకు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు అవిశ్రాంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత ఎన్నికలు అంజిరెడ్డి, కొమరయ్యకు చెందినవి కావని, ఈ ఎన్నికలు ప్రతి బీజేపీ కార్యకర్త భవిష్యత్‌కు పునాది వేసే ఎన్నికలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలిస్తేనే, భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీకి బలమైన స్థానం ఏర్పడుతుందన్నారు.

ఈ ఎన్నికలో మనం విజయపథాన్ని అందుకోవాలంటే, ప్రతి కార్యకర్త బాధ్యతతో పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, నాయకులు పల్లె గంగారెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నీలం చిన్న రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, పక్కన ఎంపీ అర్వింద్

విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ చేయించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేయించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆధార్ అప్‌డేట్‌తో భవిష్యత్తులో జేఈఈ వంటి పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తవని అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఆధార్ డిప్యూటీ డైరెక్టర్ చైతన్యరెడ్డి వీసీ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైతన్యరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 61,412 మంది, 15ఏళ్ల వయస్సు ఉన్న 40,275 మంది ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ పెండింగ్‌లో ఉందని వెల్లడించారు. ఈ విషయమై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు స్పందిస్తూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్‌కు చర్యలు తీసుకోవాలని డీఈవో అశోక్‌ను ఆదేశించారు. నిజామాబాద్ నగరంలోని పాఠశాలల్లో ఈ ప్రక్రియను వెంటనే చేపట్టాలని, నెలరోజుల్లోగా విద్యార్థులందరి బయోమెట్రిక్ అప్‌డేట్ జరిగేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. పుట్టిన శిశువు మొదలుకొని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా తల్లిదండ్రులు ఆధార్ నమోదు చేసేలా జిల్లా యంత్రాంగం చొరవచూపాలని డీడీ చైతన్య రెడ్డి కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఈ.డీఎం కార్తీక్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక్ చౌహాన్, డీడబ్ల్యూవో రసూల్ బీ, డీఎస్సీడీవో నిర్మల, పోస్టల్ అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలి

- ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్
- రైల్వే సిగ్నల్స్, స్టేషన్ భద్రత పరిశీలన



నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

ఖలీల్‌వాడి: రైల్వే సిగ్నల్స్, ఇంజినీరింగ్, స్టేషన్ భద్రతకు సంబంధించిన వస్తువుల లభ్యత, అధికారుల పనితీరుపై దృష్టిసారించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నిజామాబాద్ రైల్వేస్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమైన జీఎం.. రికార్డులను పరిశీలించి, ఉద్యోగుల సమయపాలనపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. రైళ్లను సకాలంలో నడిపి ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా కృషి చేయాలన్నారు. అనంతరం రూ.53.30 కోట్లతో చేపట్టిన రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు.

రైల్వే కనెక్టివిటీ పెంచాలి

జిల్లా నుంచి రైల్వే కనెక్టివిటీని పెంచాలని జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్‌ఎం లోకేశ్ వైష్ణోయ్‌ను నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ ఆర్ జగదీశ్వర్ రావు, జనరల్ సెక్రటరీ కమల్ ఇనాని కోరారు. రైల్వేస్టేషన్ తనిఖీకి వచ్చిన జీఎం, డీఆర్‌ఎంలను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జగదీశ్వర్ రావు మాట్లాడుతూ రైల్వే కనెక్టివిటీతో నిజామాబాద్ మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రైల్వేట్రాక్ డబ్లింగ్, ప్లాట్‌ఫామ్‌ల విస్తరణ, మధ్యాహ్నం పీక్ అవర్స్‌లో హైదరాబాద్, ముంబై వైపు రైళ్లు నడపాలని కోరారు. ధర్మాబాద్‌లో పార్కింగ్ చేస్తున్న రైళ్లను నిజామాబాద్ వరకు నడపాలని, వందేభారత్ రైళ్లని ఇక్కడి వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్ రావు, గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మద్దతుకు మించి మహాధర

- మార్కెట్‌లో శనగ ధర ఆశాజనకం
- మహారాష్ట్రలో క్వింటాల్‌కు రూ.6వేల నుంచి రూ.7వేలు
- పల్లెల్లో కొనుగోళ్లను ప్రారంభించిన కమీషన్ ఏజెంట్లు, దళారులు..
- వారు చెల్లిస్తోంది రూ.5,600.. మద్దతు ధర రూ.5,650

బోధన్: జిల్లాలో శనగ పంట కోతలు ఊపందుకున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పోలిస్తే మార్కెట్‌లో ప్రస్తుతం మంచి ధర లభిస్తోంది. మహారాష్ట్ర మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.6వేల నుంచి రూ.7వేల వరకు ధర పలుకుతుండగా, అక్కడి వ్యాపారులతో వ్యాపార సంబంధాలు ఉన్న కమీషన్ ఏజెంట్లు, దళారులు రూ.500 వరకు తక్కువ చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. మార్క్‌ఫెడ్ మార్గదర్శకాలు, అనుమతులు త్వరలోనే వస్తాయని సొసైటీల సీఈవోలు చెబుతున్నారు.

మిశ్రమ దిగుబడి

జిల్లాలోని 16,612 ఎకరాల విస్తీర్ణంలో శనగ సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. బోధన్ డివిజన్ పరిధిలోని బోధన్, సాలూర, కోటగిరి, పొతంగల్, రెంజల్ మండలాల్లో అత్యధికంగా శనగ సాగు చేశారు. సాధారణంగా ఎకరానికి గరిష్టంగా 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ.. ఈ ఏడాది 7 నుంచి 8 క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. పంట వైరస్‌బారిన పడిన ప్రాంతాల్లో 4 నుంచి 5 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు నిరాశ చెందుతున్నారు.



సాలూర సొసైటీ కొనుగోలు కేంద్రం ఆవరణలో రైతులు ఆరబెట్టిన శనగలు

మద్దతు ధర రూ.5,650

కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ శనగకు మద్దతు ధర రూ.5,650 ప్రకటించింది. గతేడాది రూ.5,440 ఉండగా, ఈసారి స్వల్పంగా పెరిగింది. గతేడాది కూడా మద్దతు ధరతో పోలిస్తే మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటంతో రైతులు వ్యాపారులకే విక్రయించారు. రైతులు పంట దిగుబడిని పూర్తిగా విక్రయించిన తరువాత మార్కెట్‌లో ధర పెరిగింది. ఇదిలా ఉండగా ఇక్కడి కమీషన్ ఏజెంట్లు, దళారులు ప్రస్తుతం శనగ కొనుగోళ్లను ప్రారంభించి క్వింటాల్‌కు రూ. 5,600 చొప్పున చెల్లిస్తున్నారు. తూకం వేయగానే డబ్బులు చెల్లిస్తుండడంతో రైతులు పంట దిగుబడిని దళారులకు విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ధర సైతం నిలకడగా ఉంటుందనే భరోసా లేదని, కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే ధర నిలకడగా ఉంటుందని పేర్కొంటున్నారు.

అక్కడి ధరలో హెచ్చుతగ్గులు

బోధన్ డివిజన్‌కు సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర ప్రాంతంలోని బిలోలి, డెగ్లూర్, ధర్మాబాద్, కొండల్‌వాడి, నాయ్‌గావ్ మార్కెట్‌లో శనగ ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. వారం క్రితం క్వింటాల్ ధర రూ.7 వేలకుపైగా పలుకగా, రెండు రోజుల నుంచి రూ.6 వేలకు తగ్గించారు.

కేంద్రాలు ప్రారంభిస్తే మేలు



మార్కెట్లో ధర ప్రభుత్వ మద్దతు ధర కన్నా కొంత ఎక్కువ ఉంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే మార్కెట్‌లో ధర నిలకడగా ఉంటుంది. సొసైటీలో కొనుగోలు కేంద్రం లేకపోతే వ్యాపారులు ధర తగ్గించే అవకాశం ఉంది. ఎండు తెగులు సోకి శనగ దిగుబడి తగ్గింది. ఆలస్యం చేయకుండా అధికారులు స్పందించాలి.

– దార్నె రమేశ్, రైతు, సాలూర

క్లుప్తంగా

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు జరిమానా విధిస్తున్న ఎస్సై

ఆర్మూర్‌టౌన్‌: వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని ఎస్సై రఘుపతి అన్నారు. ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. నంబర్‌ ప్లేట్‌ సరిగా లేని, వాహన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ప్రతిఒక్కరూ హెల్మెట్‌ ధరించాలని, కారు నడిపిస్తున్న వారు సీటు బెల్టు పెట్టుకోవాలని వాహనదారులకు సూచించారు. ఆయన వెంట ట్రాఫిక్‌ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ముందుకు సాగాలి

- అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి



భిక్కనూరు: విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అదనపు కలెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఆయన మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి రజిత తదితరులున్నారు.

అభ్యసన సామర్థ్యాల పెంపుపై దృష్టి సారించాలి



బోధన్‌: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో ఉపాధ్యాయులకు సూచించారు. చదువుతో పాటు ఆరోగ్య అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. బుధవారం సాలూ ర జెడ్పీహెచ్‌ఎస్‌, మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలను సబ్‌ కలెక్టర్‌, స్థానిక తహసీల్దార్‌ శశిభూషణ్‌తో కలిసి సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటశాలలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని హెచ్‌ఎంలకు ఆదేశించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్‌ పీఎస్‌ పరిధిలో తాళం వేసిన ఓ ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై యాసిన్‌ అరాఫత్‌ బుధవారం తెలిపారు. గాజుల్‌పేట్‌కు చెందిన రణ్‌పాల్‌ సింగ్‌ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం బంధువుల ఫంక్షన్‌కు వెళ్లారు. బుధవారం ఉదయం తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లో ఉన్న తులంన్నర బంగారం, రూ. 25 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్‌ గ్రామ సమీపంలో మామిడి తోటలో పేకాట ఆడుతున్న వారిని బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకొని వారి నుంచి రూ.7550 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలయాల్లో సమస్యలు పట్టేదెవరికి..?

- కార్యనిర్వహణాధికారుల కొరత
- ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో 11 మందికి ఆరుగురే ఈవోలు
- ఉన్న వారికి అదనపు బాధ్యతలు
- పనిభారంతో అస్తవ్యస్తంగా మారిన ఆలయాల పాలన



నీలకంఠేశ్వర ఆలయం

నిజామాబాద్‌ రూరల్‌: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో కార్యనిర్వహణాధికారుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఉన్న వారికే అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆలయ పరిపాలన దారితప్పుతోంది. పూర్తి స్థాయి లో ఈవోలను నియమించాలని సిబ్బంది కోరుతున్నారు. జిల్లా కేంద్రంలోని మాధవనగర్‌ సాయిబాబా ఆలయ కార్యనిర్వాహకుడిగా(ఈవో) పనిచేస్తున్న ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌ శ్రీరాం రవీందర్‌కు నీలకంఠేశ్వర ఆలయంతో పాటు ఆరు ఆలయాల కార్యనిర్వహణ బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. ఇదివరకు గ్రేడ్‌–1 ఉన్న ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌ దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లారు. దీంతో శ్రీరాం రవీందర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. అదేవిధంగా జెండా బాలాజీ మందిరానికి ఈవోగా ఉన్న వేణు జానకంపేట శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయంతో పాటు మరో ఐదు ఆలయాలకు కార్యనిర్వహణ బాధ్యతలను అప్పగించారు. అంతేకాకుండా జిల్లా కేంద్రంలోని బడా రాంమందిర్‌ భూములకు సంబంధించిన రూ. వేల కోట్లు విలువ చేసే భూములు అన్యాక్రాంతం కాకుండా ఫిట్‌పర్సన్‌గా నియమించారు. దీంతో నిజామాబాద్‌, ఆదిలాబాద్‌, మహారాష్ట్రతోపాటు నాందేడ్‌లో ఉన్న భూములు సర్వే చేయాల్సి ఉంటుంది.

ఆలయాల్లో ప్రధాన బాధ్యత ఈవోలదే..

దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ప్రధాన ఆలయాల్లో హుండీ లెక్కింపు, ఆలయాల భూముల పరిరక్షణ, సీసీ కెమెరాల ఏర్పాటు, ఆలయాల సిబ్బందికి, అధికారులకు కార్యనిర్వహణ అధికారుల(ఈవో) బాధ్యత ఎంతగానోఉంటుంది. వీరు ఆలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేయాల్సి ఉంటుంది. ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో దూపదీప నైవేద్యాల నిధులను సమకూర్చడంలోనూ వీరు బాధ్యత వహిస్తారు.

పనిభారం పెరిగి..

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో మొత్తం 11 మంది కార్యనిర్వహణ అధికారులు(ఈవో) ఉండాలి. కానీ ఆరుగురే ఉన్నారు. దీంతో ఉన్నవారికే ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. దీంతో వీరి పరిధిలో ఉన్న ఆలయాలే కాక అదనపు బాధ్యతలతో సతమతమవుతున్నారు. ఒక్కొక్క ఈవో పదికి మించి ఆలయాల పర్యవేక్షణ చేయాల్సి వస్తోంది. దీంతో పనిభారం పెరిగి పాలన అస్తవ్యస్తంగా మారుతోందనే ఆరోపణలు ఉన్నాయి. పూర్తి స్థాయిలో ఈవోలను నియమించి ఆలయాల్లో నెలకొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిబ్బంది కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,359 ఆలయాలు

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో 1,359 ఆలయాలు ఉన్నాయి. వీటిలో రూ. కోటి ఆదాయం వచ్చే ఆలయాలు 6(ఏ)కింద ఆరు ఆలయాలు ఉంటే, రూ. 25 లక్షలు ఆదాయం ఉన్నవి 6(బీ) కింద11 దేవాలయాలు, రూ. రెండు లక్షల వరకు ఆదాయం ఉన్న ఆలయాలు 6(సీ)కింద 1,340 ఆలయాలు ఉన్నా యి. మఠాలు 6(డి) కింద ఉన్నాయి. ఇందులో 384 దేవాలయాలకు 4,153.25 ఎకరాల భూములు ఉన్నాయి. వాటిలో 568.94 ఎకరాలను రైతులకు కౌలుకు ఇచ్చారు. దీని ద్వారా ఆలయాలకు రూ.27.53 లక్షల ఆదాయం సమకూరుతోంది.

నివేదిక అందించాం



ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో ఖాళీగా ఉన్న ఈవో పోస్టుల కోసం దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులకు నివేదిక అందించాం. పూర్తి స్థాయిలో ఆలయాల్లో అధికారులు, సిబ్బంది ఉంటే ఉత్సవాలు, పండుగలకు ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ఆలయాలకు ఐదుగురు కార్యనిర్వహణ అధికారులు అవసరం. ఆలయ భూముల పరిరక్షణ సర్వే వివరాల కోసం సిబ్బంది కూడా అవసరమే. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము.

– శ్రీరాం రవీందర్‌, ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌

ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి రాజశ్రీ

బోధన్‌టౌన్‌ : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పట్టణంలోని బస్తీ దవాఖానాలో ఫైలేరియాపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రజలకు ఫైలేరియా వ్యాధి (బోధకాలు)పై అవగాహన కల్పించాలని సూచించారు. మార్చి 13, 18, 23 తేదీల్లో డివిజన్‌లో ఎంపిక చేయబడిన ప్రాంతాల్లో ఫైలేరియా వ్యాధి నిర్ధారణకు రక్తనమూనాలు సేకరిస్తామన్నారు. ఈసదస్సులో మలేరియా జిల్లా అధికారి తుకారాం రాథోడ్‌, డిప్యూటీ డీఎంహెచ్‌వో సమత, మెడికల్‌ ఆఫీసర్స్‌, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

పోలింగ్‌ కేంద్రాలను పరిశీలించిన ఏసీపీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏసీపీ

బాల్కొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్‌ కేంద్రాలను ఆర్మూర్‌ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్‌ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలను మెరుగు పరచాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పలు ప్రశ్నలు వేసి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో రాజేశ్వర్‌, ఎస్సై నరేశ్‌ తదితరులు ఉన్నారు.

'గ్రాడ్యుయేట్‌ బోర్డు ఏర్పాటుకు కృషి'



సమావేశంలో మాట్లాడుతున్న దేవిదాస్‌

నిజామాబాద్‌నాగారం: గ్రాడ్యుయేట్‌ బోర్డు ఏర్పాటుతో ఉచిత విద్య, వైద్యం అందించేందుకు కృషి చేస్తానని గ్రాడ్యుయేట్‌ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పులగం దేవిదాస్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రాడ్యుయేట్‌ బోర్డు ఏర్పాటుకు, రాష్ట్రంలోని గ్రాడ్యుయేట్లను బోర్డు పరిధిలోకి తీసుకొచ్చి వారి సంక్షేమానికి, గ్రాడ్యుయేషన్‌ తర్వాత మూడేళ్ల పాటు రూ. 10 వేల నిరుద్యోగ భృతి చెల్లించేందుకు కృషి చేస్తానన్నారు. కార్పొరేట్‌ విద్యా సంస్థల్లో బీపీఎల్‌ విద్యార్థులకు ఉచిత విద్య అమలుకు కృషి చేస్తానన్నారు. గిరిజన ఏజెన్సీలో నిరుద్యోగ గ్రాడ్యుయేట్లకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన అబ్రహం, వీరేశంగౌడ్‌

నాగిరెడ్డిపేట: మండలంలోని మాల్తుమ్మెద శివారులో బైక్‌ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నవాబుపేట గ్రామానికి చెందిన అబ్రహం, వీరేశంగౌడ్‌ బడాపహాడ్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద శివారులో బైక్‌ అదుపుతప్పి కిందపడిపోయింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 సమాచారం అందించారు. సిబ్బంది అనిల్‌, మహేశ్‌ ఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ వారిని మొదటగా చికిత్స నిమిత్తం నాగిరెడ్డిపేటకు మెరుగైన వైద్యం కోసం మెదక్‌కు తరలించారు.

అదృశ్యమైన మహిళ హత్య



కొండ లక్ష్మి(ఫైల్‌)

మోర్తాడ్‌: నెల రోజుల క్రితం అదృశ్యమైన మహిళ హత్యకు గురైంది. ఈ ఘటనకు సంబంధించి భీమ్‌గల్‌ సీఐ సత్యనారాయణ, ఎస్సై రాము బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని ఏర్గట్ల మండలం నాగేంద్రనగర్‌కు చెందిన కొండ లక్ష్మి(45) గ్రామంలో ఆశావర్కర్‌గా పనిచేస్తోంది. ఈ ఏడాది జనవరి 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమార్తె అనూష ఏర్గట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నిర్మల్‌ జిల్లా మామడ మండలం పొన్కల్‌కు చెందిన కొంచపు వెంకటేశ్‌, లక్ష్మిని నమ్మించి తనవద్దకు పిలిపించుకొని హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా నెల రోజుల క్రితమే ఆమెను పొన్కల్‌ అటవీ ప్రాంతంలో హత్య చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

కుమార్తెపై లైంగిక దాడి కేసులో తండ్రికి ఏడేళ్ల జైలు

కామారెడ్డి క్రైం: కుమార్తెపై లైంగిక దాడి కేసులో తండ్రికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్‌ శ్రీనివాస్‌ నాయక్‌ బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. బీబీపేట పీఎస్‌ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన దేవరాజు అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన 15 ఏళ్ల కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లి వచ్చాక విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా బీబీపేట పీఎస్‌లో జనవరి 14న కేసు నమోదైంది. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన జడ్జి నిందితుడు దేవరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసును సరైన పద్ధతిలో విచారించి, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు ఆర్‌ ప్రకాశ్‌, శ్రీనివాసులు, నాగేశ్వర్‌ రావు, సీఐ తిరుపయ్య, సంపత్‌ కుమార్‌, ఎస్సై అనిల్‌, పీపీ శేషు, పోలీసు సిబ్బంది మురళీ, ప్రమోద్‌ రెడ్డి, ప్రవీణ్‌ లను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో ముగ్గురికి రెండు రోజులు..

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో ముగ్గురికి జైలు శిక్ష పడినట్లు ట్రాఫిక్‌ సీఐ పి ప్రసాద్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి నగరంలోని ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కౌన్సెలింగ్‌ నిర్వహించారు. అనంతరం వీరిని సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ నూర్జహాన్‌ ఎదుట హాజరుపర్చగా 15 మందికి రూ. 36,200 జరిమానా విధించారు. నగరంలోని కోటగల్లీకి చెందిన ఎస్‌ శ్రీనివాస్‌. నిర్మల్‌ జిల్లాకు చెందిన ఎం రాజేశ్‌, ఖిల్లారోడ్డులోని అఖిల్‌కు రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ పేర్కొన్నారు.

కమ్మర్‌పల్లిలో ఒకరికి..

కమ్మర్‌పల్లి: డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష పడినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌ రెడ్డి బుధవారం తెలిపారు. మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేస్తుండగా మోర్తాడ్‌ మండలం దొన్కల్‌ గ్రామానికి చెందిన గంగాధర బాబురావు అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. అతన్ని ఆర్మూర్‌ కోర్టులో హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి గట్టు గంగాధర్‌ బాబురావుకు రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆరు ట్రాక్టర్ల ఇసుక డంప్‌ సీజ్‌

రుద్రూర్‌: మండలంలోని సులేమాన్‌నగర్‌ శివారులో నిల్వ చేసిన ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్‌ చేశారు. గ్రామ శివారులో అక్రమంగా ఇసుక డంప్‌ చేశారనే సమాచారం మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ భారతి వెళ్లి ఇసుక డంప్‌ను పరిశీలించారు. స్థానికంగా విచారణ చేపట్టగా అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించి సీజ్‌ చేశారు. సీజ్‌ చేసిన ఇసుక సుమారు ఆరు ట్రాక్టర్ల వరకు ఉంటుందన్నారు. ఇసుకను ప్రభుత్వ అభివృద్ధి పనులకు కేటాయించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో మీసేవ కేంద్రం దగ్ధం

నిజాంసాగర్‌: విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో మీసేవ కేంద్రం దగ్ధమైన ఘటన మండలంలోని మల్లూర్‌లో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మైపాల్‌ మీసేవ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి మీసేవ కేంద్రానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి షార్ట్‌ సర్క్యూట్‌తో మీసేవ కేంద్రంలోని కంప్యూటర్‌, ప్రింటర్‌తో పాటు జిరాక్స్‌ మిషన్‌, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో రూ.1.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వ ప రిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు, గ్రామస్తులు కోరుతున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు



మైనారిటీ కళాశాలలో వంట సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్‌

రుద్రూర్‌: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు సిబ్బందికి సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్‌ కళాశాలను కలెక్టర్‌ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, సదుపాయాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. కళాశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్‌

పొతంగల్‌ పీహెచ్‌సీ తనిఖీ

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న చికిత్సలు, స్థానికంగా నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, చికిత్స నిమిత్తం ప్రతి రోజు ఎంత రోగులు వస్తున్నారని ప్రశ్నించి, రిజిస్టర్లను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందులు ఆస్పత్రిలోనే ఇస్తున్నారా అని ఆరా తీశారు. కలెక్టర్‌ వెంట తహసీల్దార్‌ గంగాధర్‌, వైద్యులు అలీమొద్దీన్‌, రాధిక, మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్‌ మొహమ్మద్‌ ముబీన్‌, అధికారులు ఉన్నారు.

పదోతరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో డీఈవో అశోక్‌, ఉపాధ్యాయులు

డీఈవో అశోక్‌

ఆర్మూర్‌టౌన్‌: పదోతరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని డీఈవో పి అశోక్‌ సూచించారు. ఆర్మూర్‌ పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో బుధవారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. పరీక్షల సమయాల్లో విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా బాగా చదివి పరీక్షలను బాగా రాయాలన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ రాజు, కాంప్లెక్స్‌ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, హెచ్‌ఎం వనజ, గంగాధర్‌, శానిటరీ ఎస్సై గజానంద్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని అడిగితే బెదిరిస్తున్నారు



మాట్లాడుతున్న బాధితులు

కామారెడ్డి టౌన్‌: భూసమస్యపై న్యాయం చేయాలని వేడుకుంటే తమపై పోలీసు కేసు పెడతానని గ్రామ పంచాయతీ కార్యదర్శి బెదిరింపులకు గురి చేస్తున్నారని గాంధారికి చెందిన బాధితులు బంజ శంకరప్ప, రాజప్పలు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. వంశపార్యపరంగా వస్తున్న తమ భూమిని కొందరు అక్రమంగా కబ్జా చేసుకుని వెంచర్లు వేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ విషయంలో ఆక్రమణదారులకు కార్యదర్శి సహకరిస్తూ తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఆటో కోసమే స్నేహితుడి హత్య

- ఇందల్వాయి అటవీ ప్రాంతంలో దహనం చేసిన మృతదేహం కేసును చేధించిన పోలీసులు



ఏసీపీ కార్యాలయంలో నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజావెంకటరెడ్డి

ఖలీల్‌వాడి: జల్సాలకు అలవాటు పడిన ఓ వ్యక్తి సొంత స్నేహితుడినే ఆటో కోసం హత్య చేశాడు. ఘటనకు సంబంధించి ఏసీపీ రాజా వెంకటరెడ్డి బుధవారం నగరంలోని ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలోని నాగారం 80 క్వార్టర్స్‌కు చెందిన సతీశ్‌ గౌడ్‌ అలియాస్‌ బబ్లూకు 2010లో హైదరాబాద్‌కు చెందిన లావణ్యతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సతీశ్‌ మద్యానికి బానిస కావడంతో పాటు జల్సాలకు అలవాటు పడ్డాడు. అతని తీరు నచ్చక భార్య పిల్లలతో కలిసి ఐదేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లింది. సతీశ్‌ గత మూడు నెలలుగా నాగారంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. గతంలో సతీశ్‌ ఆటో నడుపుతున్న సమయంలో బ్రాహ్మణ కాలనీకి చెందిన కండెల సందీప్‌(28)తో పరిచయం ఏర్పడడంతో మిత్రులుగా మారారు. కొన్ని రోజులుగా వీరిద్దరు ఆటోలో కిరాయిలకు తిరుగుతున్నారు. జల్సాలకు అలవాటుపడ్డ సతీశ్‌ డబ్బుల కోసం దొంగతనం చేద్దామని అనుకుంటున్న సమయంలో సందీప్‌ ఆటోను కొనుగోలు చేశాడు. సందీప్‌ కొనుగోలు చేసిన ఆటోను, ఫోన్‌ను కాజేయాలని సతీశ్‌ పథకం రచించాడు. ఈ నెల 15న ఇద్దరు ఆటోలో కిరాయికి వచ్చిన డబ్బులతో పలుచోట్ల మద్యం సేవించారు. సందీప్‌ మత్తులో ఉన్నట్లు గుర్తించిన సతీశ్‌ కామారెడ్డికి కిరాయికి వెళ్దామని చెప్పి తీసుకెళ్లాడు. ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి దాటిన తర్వాత మూత్రం పోసేందుకని ఇద్దరు రోడ్డుకు సమీపంలో ఉన్న చెరువు ప్రాంతానికి వెళ్లారు. ఈ క్రమంలో సందీప్‌ సతీశ్‌ను వెనుక నుంచి కిందికి నెట్టేసి బండరాయితో ఛాతి భాగంలో దాడి చేసి హత్య చేశాడు. మృతదేహం కనిపించకుండా ఉండేందుకు చుట్టుపక్కల ఉన్న కట్టెలు తెచ్చి దహనం చేసి ఆటోలో హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈ నెల 16న సందీప్‌ కనిపించడం లేదంటు అతని భార్య లత స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి సెల్‌ డాటా ప్రకారం వివరాలు సేకరించారు. సందీప్‌ సెల్‌ఫోన్‌ నుంచి సిమ్‌ తీసేసిన సతీశ్‌ తన వద్ద ఉన్న సిమ్‌ వేయడంతో పోలీసులు నిందితుడిని గుర్తించారు. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో తిరిగి జిల్లాకు వస్తున్న సతీశ్‌ను ఇందల్వాయి ప్రాంతంలో పోలీసులు పట్టుకున్నారు. అంతేకాకుండా నిందితుడు అనేక హత్య, దొంగతనాల కేసుల్లో నేరస్తుడని తెలిపారు. ఈ కేసును త్వరగా చేధించిన నార్త్‌ సీఐ బి శ్రీనివాస్‌, ఎస్సై ఎం గంగాధర్‌, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

బైక్‌ స్కామ్‌ నిందితుల అరెస్టు



వివరాలు తెలుపుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్‌: ఇన్సూరెన్స్‌ కంపెనీ వారిని మోసగించి బైకులను విక్రయించిన కేసులో తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 27 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఆర్మూర్‌ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆర్మూర్‌ పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ నిందితుల వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌ రాజేంద్రనగర్‌కు చెందిన షాహిద్‌ అలీ అతని స్నేహితుడు సయ్యద్‌ ఒమేర్‌ బీమా కంపెనీని మోసం చేసి బైక్‌లతో డబ్బులు సంపాదించడానికి పథకం రచించారు. పథకంలో భాగంగా అడ్రస్‌ ప్రూఫ్‌ సరిగా లేని వారి ఐడీ కార్డులు సృష్టించారు. వాటి ద్వారా హైదరాబాద్‌లోని బైక్‌ షో రూంలో సయ్యద్‌ ఒమేర్‌ డౌన్‌ పేమెంట్‌ కట్టి హీరో ఫిన్‌కార్ప్‌ లిమిటెడ్‌ ఫైనాన్స్‌ ద్వారా లోన్‌ తీసుకొని హీరో కంపెనీకి చెందిన బైకులను కొనుగోలు చేసేవారు. తర్వాత అనుమానం రాకుండా ఫైనాన్స్‌ కంపెనీకి బైకుల రుణాలకు సంబంధించి రెండు వాయిదాలు చెల్లించి బైక్‌లను ఇతర ప్రాంతాలకు తరలించేవారు. అనంతరం బైక్‌లు చోరీకి గురయ్యాయని పోలీసుల నుంచి ఎఫ్‌ఐఆర్‌ పొంది బీమా కంపెనీ నుంచి సదరు వాహనాల బీమా డబ్బులు పొందేవారు. కొనుగోలు చేసిన వాహనాలను హైదరాబాద్‌కు చెందిన సాబీర్‌ ఖాన్‌ ద్వారా కామారెడ్డికి చెందిన మహమ్మద్‌ యాసిన్‌కు పంపేవారు. ఆ బైకులను ఆర్మూర్‌, డొంకేశ్వర్‌, సిరికొండ, ధర్పల్లి, మాక్లూర్‌ మండల ప్రజలకు విక్రయించినట్లు ఏసీపీ తెలిపారు. బైక్‌లను అమ్మిన వ్యక్తికి, ఏజెంట్లుగా వ్యవహరించిన వారికి కమీషన్‌ ఇచ్చేవారు. ఫైనాన్స్‌ చేసిన బైక్‌లు చోరీకి గురవుతుండడంతో అనుమానం వచ్చిన హైదరాబాద్‌కు చెందిన హీరో ఫిన్‌ కార్ప్‌ లిమిటెడ్‌ సేల్స్‌ మేనేజర్‌ షేక్‌ అబ్దుల్‌ రఫీ ఆర్మూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా నిందితులను పట్టుకున్నారు. కేసును చేధించిన పోలీసులను ఏసీపీ అభినందించారు. సమావేశంలో ఆర్మూర్‌ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఎస్సై ఇంద్రకరణ్‌ రెడ్డి, తిరునగరి గోవింద్‌, మహేశ్‌, సిబ్బంది పాల్గొన్నారు.